

# వానపూలు

## - శ్రీకళ అబ్బరాజు

*(గత సంచిక తరువాయి)*

**పెళ్ళి తతంగం** జరుగుతూ వుంది.

మాంగల్యధారణ పూర్తయ్యింది. ఇంతలోనే ఒక పక్క భోజనాలు కూడా మొదలయ్యాయి. పెళ్ళివారితో బాటు వచ్చిన అతిధుల్ని కూడా భోజనానికి ఆహ్వానిస్తున్నారు. స్వప్న వాళ్ళతో బాటూ, నేనూ డైనింగ్ హాలు వైపుకి కదిలాను.

అక్కడ ఎంట్రన్స్ దగ్గర సందీప్ నిలబడి వున్నాడు.

భోజనాలగది గుమ్మం దాటుతుండగా, ఉన్నట్టుండి, నా చెయ్యి పట్టుకుని వెనక్కి లాగాడు. "నువ్వు ఉండు" నాతో చెప్పి, అతిధులు లోపలికి వెళ్ళగానే, నా వైపుకి తిరిగాడు.

"నీతో మాట్లాడాలి పద" అన్నాడు నా చెయ్యి వదలకుండానే అడుగులు వేస్తూ.

ఇద్దరం పెళ్ళి మండపం వెనకాల వున్న గదిలోకి వెళ్ళాం.

రంగారావుగారు సందీప్ గురించి చెప్పిన మాటలన్నీ మళ్ళీ గుర్తుకు వచ్చాయి నాకు. "అంటే అయ్యగారు నా కౌచ్‌లో కూర్చుని నా బెడ్ మీదే పడుకుంటున్నారన్నమాట" నా పెదవులు సంతోషంతో విచ్చుకున్నాయి.

"కూర్చో!" కుర్చీ చూపిస్తూ అన్నాడు సందీప్.

"తనూ సీను ఖచ్చితంగా నువ్వు వూహించినట్టు రొమాంటిగ్గా వుండకపోవచ్చు బిజినెస్ మీటింగుల్లోలా 'కూర్చో' అంటున్నాడు" అంతరాత్మ చెప్పింది.

"ష్" దాన్ని మందలించి, బుద్దిగా కుర్చీలో కూర్చున్నాను.

"నాన్న చెప్పిందంతా విన్నాను. ఇన్నాళ్ళూ నువ్వు నాతో చెప్పకుండా అలా ఎందుకు వెళ్ళిపోయావు" అని కోపంగా వుండేది. కానీ అతా విన్న తర్వాత నీ మీద కోపం పోయింది. నువ్వు చేసింది కరెక్టే. యూ డోంట్ డిజర్వ్ ఆల్ దిస్. మా నాన్నకి మాటిచ్చావని నన్ను పెళ్ళి చేసుకోవాల్సిన అవసరంలేదు. నీ మంచి మనసుకి, నీకో మంచి ఫ్యామిలీ దక్కాలి. మా కుటుంబంలాంటి కుటుంబం కాదు" అతను నేరుగా నా మొహంలోకి చూడకుండా, గోడ మూలలకి చూస్తూ చెప్పాడు.

నేను చటుక్కున కుర్చీలో నుంచి లేచాను.

"ఒకమాట చెప్పనా? నేనూ అచ్చం నీలాగే ఆలోచించాను. నేను వెళ్ళిపోతే మీరంతా సంతోషంగా, నార్మల్‌గా వుంటారనుకున్నాను. అది జరగలేదు. నిజం చెబుతున్నాను. ఇక్కడ నుంచి వెళ్ళిపోయాక, ఒక్కరోజు కూడా నేను సంతోషంగా లేను.

నేను నీకు చేసినట్టే నువ్వూ నాకు జీవితాంతం పనిష్మెంట్ యివ్వాలనుకుంటే యిలా మాట్లాడు. మీ అమ్మ ఎలాంటిదో తెలిసి కూడా నువ్వు నిజాన్ని యాక్సెప్ట్ చెయ్యలేకపోతున్నావు. ఆ ఫ్రస్ట్రేషనే నీ చేత యిలా మాట్లాడిస్తుంది.

ఇలాంటి, ఫ్రస్టేషన్‌తోనే చిన్నప్పుడు నన్ను అసహ్యించుకునేవాడివి. ఇప్పుడు అదే కారణంతో దూరంగా పెట్టాలని చూస్తున్నావు. మీ నాన్న చెప్పింది నిజం.

మనల్ని ప్రేమించేవాళ్ళ కోసం మనం జీవించాలి. నువ్వు లేకుండా నేను సంతోషంగా వుండలేను. ఈ విషయం గుర్తుపెట్టుకుని నిర్ణయం తీసుకో'' కళ్ళలో సుడులుగా తిరుగుతున్న నీళ్ళని కంట్రోలు చేసుకునే ప్రయత్నం చేస్తూ గబగబా అక్కడినుంచి బైటికి వెళ్ళాను.

''చిత్ర చెప్పింది, అక్షరాలా నిజం. నువ్వొక తెలివితక్కువ దద్దమ్మవి. లేకపోతే ప్రాణంలా ప్రేమించే వ్యక్తిని వదిలి వెళ్ళిపోతావా? ఇప్పుడు చూడు ఈ చిక్కుముడులన్నీ దానివల్లే వచ్చాయి'' అంతరాత్మ తిట్టిపోసింది.

నేను నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చి, ఏ.సి వెంట్ పక్కన కూర్చున్నాను.

పెళ్ళికూతురు చీర మార్చుకుని రావడానికి వెళ్ళింది. పెళ్ళికి వచ్చిన జనం, చాలావరకు భోజనాల గదిలో వున్నారు. కొంతమంది హడావుడిగా భోజనం అవుతూనే యిళ్ళకి బయలుదేరారు.

హాల్లో, మిగిలిన జనాలు, పల్చగా గుంపులు గుంపులుగా కూర్చుని వున్నారు.

''కూతురి పెళ్ళి అయ్యింది. ఇక కొడుక్కి పెళ్ళి ఎప్పుడు చేస్తావు?'' అమ్మలక్కలు సుమిత్రాదేవిని అడుగుతున్నారు.

''బంగారంలాంటి పిల్ల స్వంత మేనకోడల్ని వదులుకున్నావు. ఈ పందిట్లో ఆ అమ్మాయి అన్ని పనులూ చేస్తూ ఎంత సందడిగా తిరుగుతుందో. ఏమైనా ఈ విషయంలో నువ్వు దురదృష్టవంతురాలివే సుమిత్రా''

ఇంకెవరో సుమిత్రాదేవిని రగిలించారు. దాంతో ఆవిడకి పూనకం వచ్చింది. కాస్త దూరంలో ఒంటరిగా కూర్చుని నేను కనిపించాను. ఏం జరగబోతుందో నేను ఊహించేలోపలే ఆవిడ లేచి, రయ్యిన నా దగ్గరికి వచ్చింది.

''ఈ మహాతల్లి వల్లే నా కొడుకు కాకుండా పోయాడు. దీన్ని చూసే చిత్రని వద్దన్నాడు. మాకు శత్రువైపోయాడు.

నాకింత ద్రోహం చేసి యింకా ఏ మొహం పెట్టుకుని యిక్కడికి వచ్చిందో'' అంటూ నా రెక్కపట్టుకుని ఒక్క ఉదుటున నన్ను పైకి లేపింది.

నేను నోరు తెరిచి మాట్లాడబోయే లోపలే నన్ను దూరంగా ఒక్క తోపు తోసింది.

నేను కిందపడబోయాను. పడిపోయాననే అనుకున్నాను. ఇంతలో గబుక్కున సందీప్ వచ్చి నన్ను పట్టుకున్నాడు.

''లీవ్‌మీ నేను వెళ్ళిపోతాను'' అంటూ కోపంగా అతని చేతుల్ని విదిలించుకోబోయాను.

''ఇందాక 'ప్రేమించిన వాళ్ళకోసం నిలబడాలి' అంటూ అన్ని నీతులు చెప్పావు అసలు సమయంలో వెళ్ళిపోతానంటే ఎలా?''

సందీప్ నాతో అంటూ.. అందరి ముందు నన్ను గట్టిగా గుండెలకి హత్తుకున్నాడు.

మా చుట్టూ చేరినవాళ్ళు నోళ్ళు తెరిచి యిద్దరి వంకా విచిత్రంగా చూస్తున్నారు.

''మీరు చూస్తున్నది కలకాదు. నిజమే. ఈ అమ్మాయినే నేను ప్రేమించాను. మీ అందరికీ కాలక్షేపం కబుర్లు కావాలంటే ఎన్నైనా చెప్పుకోండి. కానీ ఈ అమ్మాయి జోలికి వస్తే మాత్రం నేనూరుకోను.''

వాళ్ళమ్మతోబాటు, చుట్టూ వున్న అందరివైపూ చూస్తూ అన్నాడు.

''ష్.. వదులు..'' చుట్టుపక్కల వాళ్ళని చూసి సిగ్గుపడుతూ అన్నాను.

"పర్లేదు. నేనూ మనుషుల్ని హేండిల్ చేయడానికి ఏదో ఒక కొత్తపద్ధతి వెతుక్కోవాలిగా" అని నవ్వుతూ వదిలేశాడు. ఆశ్చర్యంగా, మా చుట్టూ ఉన్నవాళ్ళంతా నవ్వుతూ చప్పట్లు కొట్టడం మొదలు పెట్టారు. ఒక్క సుమిత్రాదేవి తప్ప.

ఎప్పుడు వచ్చాడో అరుణ్ కూడా వాళ్ళతో కలిసి మమ్మల్ని అభినందించాడు. సుమిత్రాదేవి కోపంగా అరవబోతుంటే ఆవిడ స్నేహితురాళ్ళే ఆమెని పక్కకి లాక్కెళ్ళారు.

"వాళ్ళకి కావలసింది ప్యూర్ ఎంటర్ టెయిన్ మెంట్. ఈసారి మనం ప్రొవైడ్ చేశాం" నా చెవిలో గుసగుసగా అన్నాడు సందీప్.

"ఇదంతా కలా నిజమా?" ఒక్క క్షణం నాకేమీ అర్థం కాలేదు. "ఈ సమస్యని సందీప్ ఎంత సులువుగా పరిష్కరించాడు" నమ్మలేకపోయాను. అతని చేయి పట్టుకుని అలా నిలబడి వుంటే ప్రపంచాన్ని జయించినంత ఆనందంగా అనిపించింది నాకు.

మా పెళ్ళి చాలా సింపుల్‌గా జరిగిపోయింది. సుమిత్రాదేవి, చిత్ర తప్ప మాకు దగ్గరైనవాళ్ళు, ఆప్తులూ అందరూ పెళ్ళికి వచ్చారు.

"నేను కోరుకున్నట్టే నేను బతికుండగానే పెళ్ళి చేసుకున్నావు. ఎప్పటికీ యిలానే సంతోషంగా ఉండాలి" అంటూ నిండుమనసుతో ఆశీర్వదించింది అన్నపూర్ణమ్మగారు.

మా పెళ్ళి నిశ్చయం అయిన తర్వాతనుంచి సుమ నాతో బాగా మాట్లాడటం మొదలు పెట్టింది. అందరికన్నా ఎక్కువ సంతోషించింది రంగారవుగారు. మా అమ్మ కోరుకున్నట్టుగా నాకూ ఒక కుటుంబం ఏర్పడింది. ఎప్పటికీ ఎలాంటి గడ్డు పరిస్థితులు ఎదురైనా నా కుటుంబం కోసం నిలబడాలి అని నా పెళ్ళి అయిన రోజే నిశ్చయించుకున్నాను.

సంవత్సరం తరువాత... తలుపు ధడాల్న తీసిన చప్పుడైంది.

"ష్.ష్. బాబు నిద్రపోతున్నాడు" చిన్న గొంతుతో అన్నాను.

సందీప్ మెల్లగా నడుచుకుంటూ, నా దగ్గరకు వచ్చాడు.

"ఏదీ, నీ చెయ్యి యివ్వు" అంటూ నా చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"దీసీజ్ ఫర్ యూ" అంటూ చేతిలో చిన్న ఎర్రరంగు బాక్సుని వుంచాడు.

దాన్ని తెరిచి చూశాను.

లోపల మిలిమిలా మెరుస్తూ డైమండ్ రింగ్.

"ఒకసారి నువ్వు అన్నావు గుర్తుందా! నేను వాడిపోయిన గులాబీని, ఖాళీ పేస్టు డబ్బాలో పెట్టి తెచ్చి యిస్తానని, డైమండ్ రింగ్‌లాంటి విలువైనవేవీ గుర్తుగా ఇవ్వలేనని.."

"సందీ అది ఒక జోక్ అంతే" అన్నాను సరదాగా మూతి విరుస్తూ.

"అయ్యో! మరి నేను నిజంగానే నిజమైన డైమండ్ రింగ్ తెచ్చేశానే" ఆటపట్టిస్తూ అన్నాడు.

అతని మాటలకి నేను కిలకిలా నవ్వాను.

సందీప్ నా వేలికి ఉంగరం తొడిగాడు. ఆ తర్వాత కూడా అతని చేతులు వెనక్కి వెళ్ళలేదు. చిలిపిగా నా శరీరం మీద యింకాస్త ముందుకి సాగుతూ వున్నాయి.

ఇంతలో "హ్మ్.. హ్మ్" అని గొంతు సవరించుకున్న శబ్దం వినిపించింది. ఒకరినొకరు వదిలి ఇద్దరం సర్దుకుని నిల్చున్నాం.

"మామయ్యా అప్పుడే వచ్చేశారేం? అత్తయ్య ఎలా వున్నారు?" అడిగాను రంగారావుగారిని.

"మీ అత్తయ్య బ్రహ్మాండంగా వుంది. నువ్వు మంచితనానికిపోయి అవీ యివి యిచ్చిరండి అని పంపిస్తావుగానీ ఆవిడ అన్నీ హాయిగా తిని, నిన్ను తిడుతూ వుంటుంది" అన్నాడాయన సోఫాలో కూర్చుంటూ.

"ఆవిడ నిన్ను జన్మకి క్షమించదు. కొడుకుని కొంగున కట్టేసుకున్నావని కోపం." అంతరాతం సెటైర్ వేసింది.

"ఫర్వాలేదులెండి నాకు అలవాటైపోయింది. నేను పట్టించుకోను" అన్నాను తేలిగ్గా నవ్వేస్తూ.

సుమిత్రాదేవి మాతో కలిసి వుండదు. వేరే యింట్లో ఉంటుంది. ఆవిడ ఏం మాట్లాడినా మేము పట్టించుకోవడం మానేశాం.

"అందరూ హాయిగా, సంతోషంగా ఉండాలంటే ఇదే సరైన పద్ధతి" అని మా పెళ్ళికి ముందే చెప్పేశాడు సందీప్.

రంగారావుగారూ, సందీప్ ఆవిడ దగ్గరికి వెళ్ళి వస్తుంటారు.

ఇంతలో ఉయ్యాలలో బాబు నిద్రలేచి ఏడుపు అందుకున్నాడు. వెంటనే నేను బాబుని ఎత్తుకుని బాల్కనీలోకి వెళ్ళి నిలబడ్డాను.

బైట కనిపించిన చెట్లనీ ఎగిరే పక్షులనీ చూసి, ఏడుపు ఆపి, కిలకిలా నవ్వాడు. ఆ చిట్టి చేతుల స్పర్శ నా గుండెల మీద వెచ్చగా అనిపించింది. సంతృప్తిగా నిట్టూర్చాను.

"మనిషి జీవితంలో ఎన్నో బంధాలూ, అనుబంధాలూ ఏర్పడతాయి. కానీ అన్నీ అన్నిసార్లు నిలబెట్టుకోలేము.

మా నాన్న తనీష్ సుమిత్రాదేవి యిలాంటివాళ్ళని వదిలేసి ముందుకు సాగితేనే, మనం సంతోషంగా జీవించగలం. బాధ కలిగించినా, కొన్ని నిర్ణయాలు తప్పవు."

"ఏంటీ దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" సందీప్ నా వెనకాలే బాల్కనీలోకి వచ్చాడు.

"ఏం లేదు.." సందీప్ వంక చూసి, చిరునవ్వు నవ్వాను. అతను నా భుజం చుట్టూ చెయ్యివేసి, చిరునవ్వు నవ్వాను. అతను నా భుజం చూట్టూ చెయ్యివేసి వంగి బాబుని ముద్దాడాడు. సందీప్ స్పర్శతో బాబు ఆనందంగా చేతులు చాపి కేరింతలు కొట్టాడు.

ఒక చల్లటి గాలితెర వాన కబురుని మోసుకొచ్చింది.

ఆకాశం నెమ్మదిగా 'వానపూల'ను కురిపించడం మొదలుపెట్టింది.

**(సమాప్తం)**

Post your comments